క్లుప్తంగా

వడ్డి పోలమ్మను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని 19వ డివిజన్ లంకాపట్నంలో కొలువైన వడ్డి పోలమ్మను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఐదేళ్లకోసారి ఈ ప్రాంతంలో వడ్డిపోలమ్మ పండుగను 21 రోజుల పాటు నిర్వహిస్తారు. ఆలయానికి చేరుకున్న కోలగట్లకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరిపై వడ్డిపోలమ్మ ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న వైద్యులు

విజయనగరం ఫోర్ట్: బాలల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఎన్‌సీడీపీఓ డాక్టర్ పి. రవికుమార్ తెలిపారు. స్థానిక ఘోషాస్పత్రి ఆవరణంలో ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ)లో బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలకు ఇష్టమైనవి తెలుసుకుని అందులో వారిని ప్రోత్సహించాలని సూచించారు. బాలల ఆరోగ్య సమస్యలను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. అనూష, డాక్టర్ జి. కల్పన, తదితరులు పాల్గొన్నారు.

పది మందికి ఉపయోగపడడమే లక్ష్యం

- చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర



బేబీ కిట్ సామగ్రి చూపుతున్న సిరిసహస్ర, వైద్యులు

విజయనగరం ఫోర్ట్: పది మందికి ఉపయోగపడే మంచి పనులు చేయాలనే లక్ష్యంతోనే చిన్న శ్రీను సోల్జర్స్ అనే సేవా సంస్థను ఏర్పాటు చేసినట్టు సంస్థ అధ్యక్షురాలు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర అన్నారు. గురువారం స్థానిక ఘోషా ఆస్పత్రిలో బాలింతలకు బేబీ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఘోషా ఆస్పత్రిలో ప్రైవేట్ ఆస్పత్రుల కంటే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, జాకీర్ హుస్సేన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పూసపాటిరేగ: ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం సంతోషదాయకమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రెల్లివలసలో జరిగిన ఓ కార్యక్రమంలో కుమిలి గ్రామానికి చెందిన అడపా రామకృష్ణకు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు రూ. 2.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్నరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

పూసపాటిరేగ: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు క్రీడాకారుల పేర్లను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం. అచ్యుతకుమార్, క్రీడా కోచ్‌లు సత్యగోపాల్, సురేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తీర్మానాలు..

- విజయనగరం కార్పొరేషన్ సాధారణ, అత్యవసర సమావేశాలు
- అజెండాలోని 22 అంశాల్లో 21 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం
- మరో 4 అంశాలు ప్రతిపాదించి ఆమోదించిన కౌన్సిల్
- నగరంలోని రహదారుల ఆక్రమణలపై కఠిన చర్యలకు నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అధికారులు

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ సమావేశం జరిగింది. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాలకవర్గ సభ్యులు సమస్యలను లేవనెత్తుతూ.. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను తీర్మానాలు చేశారు. ముందుగా జరిగిన సాధారణ సమావేశంలో 17 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా.. అనంతరం జరిగిన అత్యవసర సమావేశంలో ప్రతిపాదించిన ఐదు అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. అదేవిధంగా సమావేశంలో మరో నాలుగు అంశాలను చర్చించిన కౌన్సిల్ సభ్యులు వాటిని తీర్మానించి, అమలుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించింది. సమావేశంలో భాగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ప్రధాన రోడ్లపై ఇష్టారాజ్యంగా తోపుడు బళ్ల ఏర్పాటు చేయడం, బస్సులు పార్కింగ్ చేయడం, తదితర ఆక్రమణలతో నెలకొంటున్న సమస్యలపై కఠిన చర్యలు తీసుకునేందుకు కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ ప్రతిపాదించగా... కౌన్సిల్ ఆమోదించింది. ఇందుకు సచివాలయ స్థాయి ఉద్యోగులు, పోలీస్‌సిబ్బంది సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మరో కార్పొరేటర్ వింత ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, కుక్కల నియంత్రణ శస్త్ర చికిత్సలకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. అందుకు ప్రత్యేకంగా కమిటీ వేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. 15వ డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య మాట్లాడుతూ, నగరంలో జరుగుతున్న అభివృద్ధి, ఈ మధ్యనే అంగరంగ వైభవంగా జరిగిన పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసిన కృషికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు.

కొనసాగుతున్న అభివృద్ధి..

సమావేశంలో భాగంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని సుందరీకరణ పనులు పూర్తయ్యాయని, దీంతో నగరం ఆకర్షణీయంగా కనిపిస్తోందన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఈ నెల 27వ తేదీ నుంచి నగరంలో జరగనున్న కులగణనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ఈనెల 19న ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్‌ను మహిళా పార్కులో పెద్ద తెరపై మహిళలు తిలకించే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు, కార్పొరేటర్ జీవీ రంగారావు, వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పలు తీర్మానాలు చేస్తున్న కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్

క్రీడా పోటీలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు

భోగాపురం: వచ్చేనెల 15 నుంచి జనవరి 25 వరకు జరగబోయే 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలపై ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాకు క్రీడా పోటీల నిర్వహణపై సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 ఏళ్లు దాటినా యవతీ, యువకులకు వేర్వేరుగా క్రీడలు నిర్వహించాలని, ఒక్కో క్రీడాకారుడు రెండు క్రీడల్లో మాత్రమే పాల్గొనేలా అవకాశం కల్పించాలని సూచించారు. క్రీడాకారులు ముందుగా సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ రమణమూర్తి, ముఖ్య శిక్షకులు అచ్యుతరావు, సత్యరావు, సురేష్, శ్రీనివాస్, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నాగన్న, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన..

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజల వద్దకే పాలన చేరుతోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని ఒమ్మిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, పార్టీ పరిశీలకుడు అంధవరపు సూరిబాబుతో కలిసి ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూనే.. మరో పక్క అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యం: సూరిబాబు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అశాంతిని నెలకొల్పి రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్లు వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, నాయకులు మత్స సత్యనారాయణ, పెనుమత్స సంతోష్ బాబు, దంతులూరి గిరిబాబు, పట్టణ నాయకులు సముద్రపు రామారావు, గంటా సతీష్, జమ్ము అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

• రాష్ట్రంలో సంక్షేమ పాలన....

వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రజలను లూటీ చేస్తే.. వైఎస్సార్‌సీపీ హయాంలో వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనకు.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య గల తేడాను ప్రజలకు వివరిస్తూ... రాష్ట్రానికి జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు అవసరమో వివరించడానికి వాడవాడలా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



భోగాపురం: ముంజేరు సచివాయలంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



డెంకాడ: పినతాడివాడలో సంక్షేమ వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు,వైస్ ఎంపీపీ తమ్మునాయుడు



నెల్లిమర్ల: రామతీర్థం జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



విజయనగరం రూరల్: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



పూసపాటిరేగ: సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం ఫోర్ట్: పట్టణ పరిధిలోని 33 కేవీ మహాలక్ష్మినగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలిగిస్తున్నందున పలు ప్రాంతాలకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉడాకాలనీ ఫేజ్-1,2,3,4, బొబ్బాది పేట, సాయిబాబా టెంపుల్ ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

20న మున్సిపల్ కార్మికుల నిరసన

విజయనగరం పూల్‌బాగ్: కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహనరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పాలాస్పత్రి వద్ద కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అశోక్, వంశీ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

రూ.9 వేల పింఛన్ ఇవ్వాలి

నెల్లిమర్ల: పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రూ. 9 వేల పింఛన్ ఇవ్వాలని పదవీ విరమణ ఉద్యోగుల సంఘ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ, కనీస పింఛన్ 9 వేలు ఇవ్వాలని ఈనెల 15న విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్, శ్రీనివాస శాస్త్రి, తదితరులు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా సుమారు 75 లక్షల మంది ఈపీఎఫ్ చందాదారులుండగా.. వారికి వెయ్యి నుంచి ఐదు వేల రూపాయల్లోపు మాత్రమే పింఛన్ వస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పింఛన్ పెంచాలని కోరారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండండి

విజయనగరం క్రైమ్: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. నేరస్తులు విభిన్న రీతుల్లో నేరాలకు పాల్పడుతుంటారని చెప్పారు. గురువారం రాత్రి స్థానిక జొన్నగుడ్డిలో నేరాల నియంత్రణ, నేరస్తుల పట్ల వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా సమీప పోలీస్‌స్టేషన్‌కు గాని, డయల్ 100కి గాని సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమలో వన్‌టౌన్ ఎస్సైలు భాస్కరరావు, అశోక్‌కుమార్, రామగణేష్, ఆర్.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ ఆస్తులను పరిరక్షించాలి

విజయనగరం టౌన్: సీబీసీఎన్‌సీ ఆస్తులను పరిరక్షించాలని సీబీసీఎన్‌సీ నాయకుడు, సంఘమిత్ర ఆర్‌ఎస్.జాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్‌ను విశాఖపట్టణం కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. సీబీసీఎన్‌సీ ఆస్తులు అన్యాక్రాంతం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.ఎ.నాయుడు, టి.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

'కవన కుసుమాలు' పుస్తకావిష్కరణ

విజయనగరం టౌన్: కవన కుసుమాలు పుస్తకావిష్కరణ సభ గురువారం రాత్రి స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఘనంగా జరిగింది. సాగి శివ సీతారామరాజు స్మారక కళాపీఠం, సహజ సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దోసపాటి వెంకట రామచంద్రరావు రచించిన పుస్తకాన్ని ప్రముఖ న్యాయవాది నాలుగెస్సుల రాజు ఆవిష్కరించారు. డాక్టర్ పీవీఎల్.సుబ్బారావు పుస్తక సమీక్ష చేశారు. ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జనార్దననాయుడు మాట్లాడుతూ, దోసపాటి రచనలలో సమకాలీనతతో పాటు సమస్యల ప్రస్తావన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్కే బాబు, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

- 61 సచివాలయాల్లో 21,285 మందికి వైద్య పరీక్షలు
- శస్త్ర చికిత్సలకు 211 మంది ఎంపిక



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్)

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 21,285 మంది జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలకు వచ్చి ప్రాథమిక వైద్య పరీక్షలు జరుపుకున్నారు. వీరిలో 9,183 మంది పురుషులు కాగా.. 12, 102 మంది మహిళలున్నారు. కంటివెలుగు కింద 3,067 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 211 మందిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. నగరంలో ఉన్న 61 సచివాలయాల పరిధిలో రోజుకి రెండు సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఇందుకోసం పెద్ద ఎత్తున ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సాధారణ వైద్య పరీక్షలు, బీపీ, సుగర్, హెచ్‌బీ, హెపటైటిస్ బి వంటి పరీక్షలతో పాటు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతం కావడంతో జనవరి నుంచి నిరంతరాయంగా వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. సుమారు నెల రోజులుగా నగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు జరిగాయి.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



ఎంఆర్ కళాశాల జంక్షన్ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

విజయనగరం: నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం పర్యటించి అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. ముందుగా ఎంఆర్ కాలేజ్ సమీపంలో ఉన్న బుద్ధ విగ్రహం ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సమీపంలో ఉన్న సీవేజ్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం వైఎస్సార్ జంక్షన్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించి, నీరు నిల్వ ఉండిపోవడానికి గల కారణాలను ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తక్షణమే శాశ్వత పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆ తర్వాత కేఎల్ పురంలో నూతనంగా నిర్మితమవుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దక్షిణామూర్తి, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

వసంత విహార్ వాసులకు కార్పొరేషన్ నీరు

- పైప్‌లైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



నూతన పైప్‌లైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్, తదితరులు

విజయనగరం: నగరంలోని పద్మావతినగర్ ప్రాంతంలోని వసంతవిహార్‌లో నివసిస్తున్న ప్రజలకు కార్పొరేషన్ తాగునీరు అందించనున్నారు. ఇందుకు సంబంధించిన పైప్‌లైన్ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల గురువారం శంకుస్థాపన చేశారు. రూ. 6.86 లక్షల వ్యయంతో పైపులైన్ పనులను విజయనగరం కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం చేపట్టింది. పనులు పూర్తయిన తర్వాత ఆ ప్రాంత వాసులందరికీ తాగునీటి సదుపాయం కలగనుంది. ఈ సందర్భంగా 31, 32 డివిజన్ల కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, రెండు డివిజన్‌ల పరిధిలో గల వసంత విహార వాసుల ఏళ్ల నాటి కల సాకారమవుతోందన్నారు. ధర్మపురి ప్రాంతంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పూర్తయిన వెంటనే దాని ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 31వ డివిజన్‌లో రూ.4.50 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో డివిజన్ ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, వసంత విహార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పీడీ వరహాలతో ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులు ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన సాఫ్ట్ టెన్నిస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పిఠాపురంలో జరిగిన సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు బూర్లి మనోజ్‌కుమార్, మామిడి గుణదీప్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. మరో ఇద్దరు విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పీడీ ఎస్.వరహాలును ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, తదితరులు గురువారం అభినందించారు.

విద్యారంగ బలోపేతానికి ప్రాధాన్యం

- వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు అన్నారు. మండలంలోని అలుగోలు బీసీ బాలుర వసతిగృహంలో ప్రభుత్వం సమకూర్చిన దుప్పట్లను 74 మంది విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు రాజులమ్మ, పతివాడ కన్నంనాయుడు పాల్గొన్నారు.

పుస్తకపఠనం దినచర్యలో భాగం కావాలి



పుస్తకాలను కొనుగోలు చేస్తున్న పాఠకులు

విజయనగరం అర్బన్: పుస్తక పఠనం దినచర్యలో భాగం కావాలని పలువురు పుస్తకాభిమానులు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ కూడలి వద్ద గురువారం పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పుస్తక పఠనం విజ్ఞానదాయకమే కాకుండా ఆరోగ్యదాయకమన్నారు. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను సగం ధరలకే అమ్మకాలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎస్‌ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, కోశాధికారి ఎర్నాయుడు, కర్రోతు సత్యం, రామరాజు, సన్యాసిరాజు, ఈపు విజయ్, తదితరులు పాల్గొన్నారు.